
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
బుధవారం 3 జనవరి 2024

ఆరు గ్యారెంటీ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తాం 8లో..

కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేయించాలి 7లో..

నిజామాబాద్ పార్లమెంట్‌పై ఫోకస్



జగిత్యాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రాజకీయ పార్టీలు మరో సమరానికి సన్నద్ధమవుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికల కోసం కసరత్తు చేస్తున్నాయి. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల పోరు ముగియడంతో రానున్న పార్లమెంట్ ఎన్నికలపై పార్టీలు ఇప్పటినుంచే దృష్టి సారించాయి. ఇందు లో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ ముందంజలో ఉన్నాయి. నిజామాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలయిన జగిత్యాలలో బీఆర్ఎస్‌కి ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ, కాంగ్రెస్, బీజేపీలు గణనీయమైన ఓట్లను ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో సాధించడంతో ఎంపీ ఎన్ని కలు రసవత్తరంగా సాగే అవకాశాలున్నాయి. నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలుండగా అందులో అయిదు నిజా మాబాద్ జిల్లాలో, రెండు జగిత్యాల జిల్లాలో ఉన్నాయి. కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీలలో ఇటీవల బీఆర్ఎస్ విజయం సాధించగా నిజామాబాద్ జిల్లా లోని బాల్కొండలో బీఆర్ఎస్, నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్‌లలో బీజేపీ, నిజామాబాద్ రూరల్, బోదన్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ విజ యం సాధించింది. పార్లమెంట్ పరిధిలోని మూడు అసెంబ్లీ నియోజక వ ర్గాల్లో బీఆర్ఎస్, రెండింటిలో కాంగ్రెస్, రెండింటిలో బీజేపీ గెలుపొందింది. రాష్ట్రంలో అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్ పార్లమెంట్ పోరుకు సిద్ధ మవుతోంది. ఇప్పటికే పార్లమెంట్ ఇన్‌చార్జి లను కాంగ్రెస్ ప్రకటించింది. ని జామాబాద్ సిట్టింగ్ స్థానంలో మరో సారి సత్తా చాటడానికి బీజేపీ ప్రయ త్నిస్తోంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో కోల్పోయిన స్థానాన్ని తిరిగి పొంది గులాబీ జెండా ఎగురవేయడానికి బీఆర్ఎస్ గట్టి కృషి చేస్తోంది. దీంతో ని జామాబాద్ పార్లమెంట్‌లో త్రిముఖ పోటీ నెలకొననుంది.

- సమాయత్తమవుతున్న ప్రధాన రాజకీయ పక్షాలు
- 7న బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం
- నిజామాబాద్ ఇన్‌చార్జిగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని ప్రకటించిన కాంగ్రెస్
- సిట్టింగ్ స్థానం నిలబెట్టుకోవడంపై దృష్టిసారించిన బీజేపీ
- మొదలైన పార్లమెంట్ ఎన్నికల సందడి

గెలుపు సాధించాలనే వ్యూహంతో బీఆర్ఎస్...

శాసన సభ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు సాధించాలనే వ్యూహంతో ఉంది. ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో జగిత్యాల, కోరుట్ల అసెంబ్లీ స్థానాల్లో సత్తా చాటిన బీఆర్ఎస్ అదే ఊపుతో పార్లమెంట్ ఎన్నికల్లోనూ విజయం చేజిక్కుంచుకోవడానికి ప్రయత్నిస్తోంది. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చెందిన సిట్టింగ్ ఎంపీ మధుయాష్కీపై బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన కల్వకుంట్ల కవిత విజయం సాధించి తొలిసారిగా గులాబీ జెండా ఎగురవేశారు. నిజామాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా దాదాపుగా మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత పేరు ప్రస్తుతం వినిపిస్తోంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో చేజారిన సీటును తిరిగి పొందడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

తెలంగాణ ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించిన ప్రాంతాలలో కోరుట్ల, జగిత్యాల ప్రాంతాలున్నాయి. అదే ఊపుతో గతంలో నిజామాబాద్ ఎంపీగా కవిత గెలుపొందారు. గత చివరిగా జరిగిన ఎన్నికల్లో కవిత పోటీ చేసినప్పటికీ బీజేపీ చేతిలో ఓటమి పాలయ్యారు. రాబోయే ఎన్నికల్లో పార్టీని గెలిపించడానికి బీఆర్ఎస్ గట్టి ప్రయత్నం చేస్తోంది. ఇం దులో భాగంగా నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని నేతలతో ఈనెల 7వ తేదీన హైద్రాబాద్‌లో బీఆర్ఎస్ ప్రత్యేక సమావేశం నిర్వ హించనుంది. అసెంబ్లీ నియోజకవర్గానికి 70 మంది చొప్పున పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి తరలించడానికి నేతలు దృష్టి సారించా రు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, పార్టీల బలాబలాలు తదితర అంశాలపై చర్చించనున్నారు. ఎన్నికల్లో విజయం సాధించడానికి అనుగు ణంగా శ్రేణులకు దిశా నిర్దేశం చేసే విధంగా బీఆర్ఎస్ ముందుకు వెళ్తోంది.

గెలుపు జోష్‌లో కాంగ్రెస్...

గడిచిన పదేళ్లుగా ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ తాజా ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం చేపట్టింది. అలాగే పార్లమెంట్ పరిధిలోని నిజామాబాద్ రూరల్, బోదన్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. మిగిలిన అయిదు నియోజకవర్గాల్లో గణనీయమైన ఓట్లను కైవసం చేసు కుంది. జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ రెండో స్థానం, కోరుట్లలో మూడో స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన జోష్‌తో పార్లమెంట్ ఎన్నికల్లో కూడా అదే ఊపు కొ నసాగించాలని చూస్తోంది. ఇందులో భాగంగా నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 2004, 2009లో నిజామాబాద్ పార్లమెంట్‌లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి గెలుపొందిన మధుయాష్కి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హైద్రాబాద్ ఎల్‌బీ నగర్ నుంచి బరిలోకి దిగి ఓడిపోయారు. ఇటీవల ఓ సందర్భంగా మాజీ ఎంపీ మధుయాష్కి తాను రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయనని ప్రకటించారు. నిజామాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పోటీ చేసే అవకాశాలున్నాయన్న అభిప్రాయాన్ని మధుయాష్కి వెలిబుచ్చడం చర్చనీయాంశంగా మారింది. కాగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నిజామాబాద్ నుంచి పోటీ చేస్తారా...కరీంనగర్ పార్లమెంట్ నుంచి పోటీ చేస్తారా... అన్న చర్చలు కాంగ్రెస్‌లో కొనసాగుతున్నాయి. ఇటీవ ల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన విధంగా రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు తథ్యమని కాంగ్రెస్ నాయకులున్నారు.

మోదీ చరిష్మాతో బీజేపీ...

రెండు పర్యాయాలు భారత ప్రదానీగా ఉన్న నరేంద్ర మోదీ చేసిన అభివృద్ధి, తీసుకున్న నిర్ణయాలు, అమలు చేసిన చట్టాలే తమకు ఓటు బ్యాంకుగా ఆరుతాయని కమలనాథులు అభిప్రాయపడుతున్నారు. 2019 ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి బీజేపీ విజయం సాధించింది. సిట్టింగ్ స్థానమైన నిజామాబాద్ పార్లమెంట్‌లో మరో మారు సత్తా చాటడానికి ఉవ్విళ్లూరుతున్నారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ మరో మారు పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తారన్న ప్రచారం జరుగుతోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కోరుట్లలో ద్వితీయ స్థానంలో, జగిత్యాలలో తృతీయ స్థానంలో నిలిచినప్పటికీ గతంలో కంటే గణనీయంగా ఓట్లను సాధించింది.

ఇటీవల రాష్ట్ర పర్యటనకు వచ్చిన సందర్భంగా ప్రధాని మోదీ ప్రకటించి పసుపు బోర్డు అంశం తనకు అనుకూలంగా మారుతుందని బీజేపీ బావిస్తోంది. పార్లమెంట్ పరిధిలోని అయిదు నియోజకవర్గాల్లో ఎక్కువగా పసుపు సాగు అవుతుండడం కలిసి వస్తదని అంచనా వేస్తున్నారు. ఈ దఫా శాసన సభ ఎన్నికల్లో కోరుట్ల, జగిత్యాలలో భారీగా ఓట్లు రావడం, పార్లమెంట్ పరిధిలోని ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్‌లో విజయం సాధిచండంతో గట్టి పోటీ ఇవ్వడానికి వీలుంటుందని అంటున్నారు. శాసన సభ ఎన్నికల్లో వచ్చిన ఓట్లను బట్టి పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధిస్తామన్న ధీమాతో ఉన్నారు.

అన్ని పార్టీలకు ఎజెండాగా షుగర్ ఫ్యాక్టరీ అంశం...

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని పార్టీలకు నిజాం దక్కన్ షుగర్ ప్యాక్టరీ సమస్యల అంశం ప్రధాన ఎజెండాగా మారే అవకాశాలు కనిపిస్తు న్నాయి. కోరుట్ల నియోజకవర్గం పరిధిలోని ముత్యంపేట, నిజామాబాద్ జిల్లా బోదన్‌లలో ఉన్న ఎన్‌డీఎస్‌ఎల్ మూతపడి ఏళ్లు గడుస్తున్నప్పటికీ తెరుచుకోలేదు. ఫ్యాక్టరీ పునరుద్ధరణ అంశంపై ప్రధాన రాజకీయ పక్షాలు దృష్టి సారిస్తున్నాయి. నిజామాబాద్, జగిత్యాల జిల్లాలో ప్రభావం చూపే ఎన్‌డీఎస్‌ఎల్ అంశాన్ని తమకు అనుకూలంగా మలుచుకోవడానికి పార్టీ లు ప్రయత్నిస్తున్నాయి. పసుపు రైతుల సమస్యలు, గల్ఫ్ సమస్యలు ప్ర ధాన ఎజెండాగా మారుతాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలకు ఎన్నికల కమిషన్ సన్నద్ధమవుతుండడంతో పార్టీల నేతలు కూడా తమ తమ ఏర్పాట్లలో నిమగ్నమవుతున్నారు. ని జామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం మూడు పార్టీలకు గట్టిపోటీ ఇవ్వనుండడంతో అన్ని పార్టీలకు ఈ స్థానం కీలకంగా మారనుంది. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు ఎవరికి మద్దతు నిస్తారో వేచి చూడాల్సిందే మరి.

దరఖాస్తుదారులకు ఉచితంగానే అప్లికేషన్ ఫారం

కలెక్టర్ యాస్మిన్ బాషా



అయిలాపూర్‌లో దరఖాస్తు స్వీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కోరుట్ల, జనవరి 2 : ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారెంటీ పథకాలకు దరఖాస్తు చేసుకునే లబ్దిదారులకు ఉచితంగానే ఫారాలను అందివ్వాలని అధికారులకు కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా సూచించారు. మంగళవారం కోరుట్ల పట్టణంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన దరఖాస్తు స్వీకరణ కేంద్రాన్ని కలెక్టర్, కోరుట్ల ఆర్‌డీవో రాజేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. రాష్ట్రంలో ప్రభుత్వం డిసెంబర్ 9వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించిందని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో వైద్య ఖర్చులకు నిరుపేదలకు రూ. 10 లక్షల వరకు ఖర్చు భరిస్తుందన్నారు. మిగితా గ్యారెంటీల ఎంపికకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు ఫారం ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. ప్రతి దరఖాస్తుదారులు ఆధార్, రేషన్ కార్డును జతచేసి అందించాలని అన్నారు. కేంద్రంలో స్వీకరిస్తున్న దరఖాస్తులను పరిశీలించారు. పట్టణంలో నిర్వహిస్తున్న దరఖాస్తు కేంద్రాల వివరాలను మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో దేవరాజ్, మైనింగ్ సహాయ సంచాలకులు విజయ్‌కుమార్ రాథోడ్, ఆర్అండ్‌బి ఈ శ్రీనివాస్‌లతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్ : మండలంలోని అయిలాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామ సభను కలెక్టర్ యాస్మిన్ బాషా పరిశీలించారు. దరఖాస్తుల స్వీకరణ వివరాలను గ్రామస్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల స్వీకరణలో తీసుకోవలసిన జాగ్రత్తలను అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్‌డీవో రాజేశ్వర్, తహసీల్దార్ కిషన్, ఎంపీడీవో శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ పిడుగు రాధ-సందయ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా కృషి చేయాలి

ఎస్పీ సన్ ప్రీత్ సింగ్



ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ

జగిత్యాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా కృషి చేయాలని పోలీసు అధికారులను ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను అయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, రిసెప్షన్, స్టేషన్ రైటర్, ఎస్‌హెచ్ఓ, రెస్ట్ రూమ్, లాక్ అప్ రూమ్ తదితర వాటిని పరిశీలించారు. కోర్టు విధులు నిర్వహించే అధికారుల గదిలో రికార్డులు భద్రపరుచుట తదితర అంశాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో ఎంత మంది సిబ్బంది ఉన్నారు..వారు ఏఏ విధులు నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ నుంచి ప్రతీ రోజు ఎన్ని బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ విధులు నిర్వహిస్తున్నాయని, ఎక్కడెక్కడ ఎన్ని బీట్స్ నడుస్తున్నాయని తెలుసుకున్నారు. పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూడాలని సూచించారు. ప్రజా ఫిర్యాదు పరిష్కారంలో ఎటువంటి జాప్యం జరగకుండా తక్షణమే స్పందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఇన్స్‌పెక్టర్ నటేశ్, ట్రాఫిక్ ఎస్ఐ రామచంద్రం, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ

జగిత్యాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, అదనపు కలెక్టర్ బీఎస్ లతలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు వెల్లువలా వచ్చాయి. పలు ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, కలెక్టర్, అదనపు కలెక్టర్లను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలందించాలి

జిల్లా వైద్యాధికారి పుప్పాల శ్రీధర్

పెగడపల్లి, జనవరి 2 : ప్రభుత్వాసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పుప్పాల శ్రీధర్ పేర్కొన్నారు. పెగడపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్యాధికారి శ్రీధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలో అందుతున్న వైద్యసేవలు, పీహెచ్‌సీలో నిత్యం ఓపి, ప్రసవాలు తదితర విషయాల గూర్చి పరిశీలించి పలు సూచనలు చేశారు. వైద్య సిబ్బంది హాజరు రిజిష్టర్‌ను పరిశీలించారు. పీహెచ్‌సీలో ప్రసవించిన మహిళకు కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నరేష్, సూపర్‌వైజర్ శ్రీనివాస్, తార, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలి

ధర్మపురి, జనవరి 2: గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి, సమస్యల పట్ల అధికారులు దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో వివిధ శాఖల పని తీరుపై అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. అయన వివిధ శాఖల పక్షాన చేపట్టిన పనులు, ప్రగతి, సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. రైతులు వేసంగి పంటలకు సాగు నీరు విషయంలో ఇబ్బందులకు గురికావద్దన్నారు. గోదావరి లిఫ్ట్ ఇరిగేషన్, రోళ్లవాగు ప్రాజెక్ట్, బోల్ చెరువు, అక్కపెల్లి, ఇతరత్రా చెరువులు, కుంటల ద్వారా సాగు నీరు సరఫరా విషయంలో సమస్యలుంటే వెంటనే గుర్తించాలన్నారు. రాబోవు వేసవి కాలం దృష్టిలో పెట్టుకుని తాగు నీరు సరఫరా విషయంలో సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్, మిషన్ భగీరథ, పంచాయితీరాజ్, ఆర్అండ్‌బీ శాఖల ఈఈలు నారాయణరెడ్డి, ఖాన్, సుధాకర్, సతీష్, శేఖర్‌రెడ్డి, రహమాన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నరసింహుని సన్నిధిలో అడిషనల్ కలెక్టర్ పూజలు

ధర్మపురి, జనవరి 2: ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత కుటుంబ సభ్యులు మంగళవారం సందర్శించారు. ఆలయం వద్ద అర్చకులు, సిబ్బంది ఆమెకు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. మొదట ధ్వజ స్తంభం వద్ద ఆమె దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆమె స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు ఆమె కుటుంబ సభ్యులను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ వారికి స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించి సత్కరించారు. ఆమె వెంట తహసీల్దార్ కృష్ణచైతన్య, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ చైర్‌పర్సన్‌కు అభినందనలు

జగిత్యాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ క్యాంపు కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్‌ను మంగళవారం పలువురు అధికారులు, ఉద్యోగులు నూతన సంవత్సర శుభాకాంక్షలు అందించి సత్కరించారు. జడ్పీ సీఈవో రఘువరణ్, పీఆర్ ఈఈ రహమన్, డీఈ మిలింగ్, డీఆర్‌డీవో నరేశ్, రిటైర్డు ఉద్యోగి హరి అశోక్‌కుమార్ జడ్పీ చైర్‌పర్సన్ వసంతను కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాలు కప్పి సత్కరించారు.

జాబితాపూర్ సర్పంచ్ సస్పెన్షన్

జగిత్యాలరూరల్, జనవరి 2 : జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామసర్పంచ్ అంకం మమతను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో గ్రామపంచాయతీలో జరిగిన 5 అభివృద్ధి పనుల్లో నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ జాబితాపూర్ గ్రామానికి చెందిన మారు గంగారెడ్డి ఫిర్యాదు చేశారు. అధికారులు విచారణ జరుపగా రూ. 11,8,148 నిధులు దుర్వినియోగం జరిగినట్లు నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేశారు.

ఎన్నికల సందర్భంగా ఇంటలిజెన్స్ కమిటీ ఏర్పాటు

● కలెక్టర్ పమేలా సత్పతి


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాబోయే పార్లమెంట్ సాధారణ ఎన్నికల నేపథ్యంలో గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో చేసిన ఖర్చు, డబ్బు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీ పట్టివేతకు సంబంధించిన సమాచారం ఆధారంగా ప్రాథమిక నివేదిక సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి అధికారులకు సూచించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఎన్నికల వ్యయ సున్నితమైన నియోజకవర్గాలు, ప్రాంతాలను గుర్తించుటకు మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ఇంటలిజెన్స్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెకటర్ మాట్లాడుతూ ఈ జిల్లాస్థాయి కమిటీలో జిల్లా రెవెన్యూ శాఖతో పాటు సభ్యులుగా ఉండి గత అసెంబ్లీ, పార్లమెంటరీ ఎన్నికల సమయంలో ఖర్చు చేసిన డబ్బు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీ పట్టివేతల సమాచారం ఆధారంగా ప్రాథమిక నివేదిక ఏర్పాటు చేయాలన్నారు. నివేదిక ఆధారంగానే జిల్లాలోని సున్నితమైన వ్యయ అసెంబ్లీ నియోజకవర్గాలు, ప్రాంతాలను ఎన్నికల సంఘం గుర్తించి తదనుగుణంగానే, వాటిని ప్రత్యేకంగా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్వో పవన్ కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి శ్రీనివాసరావు, ఏసీపీ పి కిష్టయ్య, ఇన్‌కంటాక్స్ అధికారి ఆర్ రాజేష్, జీఎస్టీ అధికారి వి మధునయ్య, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆంజనేయులు, ఎలక్షన్ డీటీలు, అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌యూ ఎంఈడీ పరీక్ష ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, జనవరి 2: ఎస్‌యూ పరిధిలోని ఎంఈడీ రెండో సెమిస్టర్, బీ ఫార్మసీ మొదటి, రెండు, మూడు, నాలుగో సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.వీ.శ్రీరంగప్రసాద్ తెలిపారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు.

'కరీంనగర్-హసన్‌పర్తి రైల్వేలైన్ పనులు త్వరలో ప్రారంభం'

భగత్‌నగర్, జనవరి 2: కరీంనగర్-హసన్‌పర్తి రైల్వే లైన్ పనులు త్వరలో ప్రారంభమవుతాయని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం నగరంలోని పద్మశాలి భవన్‌లో సంఘం కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున నిధులు తీసుకు వచ్చానన్నారు. ప్రజల కోరిక మేరకు కరీంనగర్-హసన్‌పర్తి కొత్త రైల్వే లైన్‌కు సంబంధించిన సర్వే పనులు పూర్తి కాబోతున్నాయన్నారు. ఒక వర్గం ఓట్ల కోసం పాకులాడితే 2014, 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచేవాడినన్నారు. తనకు ధర్మమే ముఖ్యమని, హిందు ధర్మ రక్షణ కోసం ఎంతవరకైనా వెళతా.. కానీ ఓట్లకోసం పాకులాడేది లేదన్నారు. రాష్ట్రంలో కుల వృత్తులు,కుల సంఘాల అభ్యున్నతికి పైసలిచ్చేందుకు వెనుకాడే రాష్ట్ర ప్రభుత్వం ఉగ్రవాదులను పెంచిపోషిస్తున్న, మత మార్పిడులను ప్రోత్సహిస్తున్న తబ్లిగ్‌జమాతే వంటి సంస్థలు నిర్వహించే సభలు సమావేశాలకు రూ.3 కోట్ల రూపాయల నిధులు కేటాయించడం సిగ్గుచేటన్నారు. ఇకనైనా హిందుసమాజం సంఘటితం కావాల్సిన అవసరం ఉందన్నారు. దేశం సురక్షితంగా ఉండాలంటే ప్రజలకు ఉపయోగపడే చట్టాలు కార్యరూపం దాల్చాలంటే బీజేపీ గెలుపు అనివార్యమన్నారు. భారత పౌరులంతా దేశంలో ఎక్కడికైనా వెళ్లి స్థలం కొనుక్కొని ఇల్లుకట్టుకుని నివసించే అవకాశం ఉంటుందని, వివాహాలు చేసుకునే అవకాశం ఉందని, కశ్మీర్‌లో మాత్రం అవకాశం లేకుండా కాంగ్రెస్ పాలకులు చేశారన్నారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



బోనంతో బారులుదీరిన భక్తులు

వేములవాడ, జనవరి 2: రాజరాజేశ్వరస్వామి వారి అనుబంధ దేవాలయమైన బద్ది పోచమ్మ ఆలయం మంగళవారం నాడు భక్తులతో రద్దీగా మారింది. సోమవారం నాడు తమ ఇష్టదైవమైన శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆనవాయితీ ప్రకారం మంగళవారం నాడు బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే భక్తిశ్రద్ధలతో నైవేద్యం వండి బోనం తయారుచేసి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని బద్ది పోచమ్మ అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

రాజన్న ఆలయానికి అదనపు భద్రత

- 11 మంది ఎస్పీఎఫ్ సిబ్బంది కేటాయింపు - మహాశివరాత్రి వరకు విధులు నిర్వహించనున్న సిబ్బంది

వేములవాడ, జనవరి 2: వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి అధికారులు అదనపు భద్రత కల్పించారు. రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం భద్రత కోసం స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) విభాగానికి చెందిన సిబ్బంది భద్రతను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఇద్దరు హెడ్‌కానిస్టేబు ల్స్, పదిమంది పోలీస్ కానిస్టేబుల్‌లతో కలిపి మొత్తం 12 మంది ఎస్పీఎఫ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరిలో మేడారం సమ్మక్క సారలమ్మ జాతర జరగనున్న తరుణంలో కొద్ది వారాలుగా వేములవాడ రాజన్న ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లడానికి ముందు రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకునే ఆనవాయితీలో భాగంగా భక్తులు పెద్దసంఖ్యలో వేములవాడకు వస్తుండడంతో ఆలయానికి అదనపు భద్రత కల్పించాలని కోరుతూ ఆలయ ఈవో డి కృష్ణప్రసాద్ ఉన్నతాధికారులను కోరారు. దీంతో స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ విభాగం నుంచి ఒక ఏఎస్ఐ, ఒక హెడ్ కానిస్టేబుల్, ఎనిమిది మంది కానిస్టేబుల్స్‌ను రాజన్న ఆలయానికి అదనంగా కేటాయించారు. మార్చి 7, 8, 9వ తేదీల్లో జరగనున్న మహాశివరాత్రి జాతర వరకు అదనపు సిబ్బంది భద్రతా విధుల్లో పాల్గొంటారని ఆలయ అధికారులు తెలిపారు. ఇప్పటివరకు ఆలయంలో భద్రతా విధులు నిర్వహిస్తున్న 12 మంది ఎస్పీఎఫ్ సిబ్బందికి మరో పదకొండు మంది అదనంగా వచ్చి చేరడంతో మొత్తం ఎస్పీఎఫ్ భద్రత సిబ్బంది సంఖ్య 23 కు చేరుకుంది. వీరికి అదనంగా 33 మంది హోంగార్డులు కూడా ఆలయ భద్రత విధుల్లో పాల్గొంటున్నారు.



వేములవాడ చేరుకున్న ఎస్పీఎఫ్ సిబ్బంది

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



తాళ్ల శృతి



కోనేటి అభినవ్

తిమ్మాపూర్, జనవరి 2: మండలంలోని మొగిళిపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న తాళ్ల శృతి, కోనేటి అభినవ్ ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. తొర్రూరు జిల్లాలో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ అండర్ 17పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటి ఈనెల 3 నుంచి 6వ తేది వరకు ఛత్తీస్‌గడ్ రాష్ట్రం, బిలాస్పూర్‌లో జరగనున్న 67వ జాతీయస్థాయి పోటీల్లో ఇద్దరు విద్యార్థులు పాల్గొంటున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి, పీఈటీ ఆడెపు శ్రీనివాస్ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను సర్పంచ్ సుస్మితారెడ్డి, ఎంపీటీసీ తిలక్ ప్రియా రెడ్డి, గ్రామ పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

రూ.6,800 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జనవరి 2: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 6,800 రూపాయలు పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 70మంది రైతులు 669 క్వింటాళ్ల విడి పత్తి, ఆరుగురు రైతులు గోనె సంచుల్లో ఏడు క్వింటాళ్ల విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 6,800 రూపాయలు, కనిష్ఠ ధర 5,400 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, జనవరి 2: స్థానిక ఎస్‌బీఐ ఆర్‌సెటి గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో జనరల్ ఈడీపీ(వ్యాపార నైపుణ్యాభివృద్ధి)లో ఈ నెల 8 నుంచి ఉచిత శిక్షణ ప్రారంభం కానున్నట్లు సంస్థ డైరెక్టర్ సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన 18-45 సంవత్సరాలు గల గ్రామీణ పురుషులు దరఖాస్తు చేసుకోవాలని పూర్తి వివరాలకు 9949448197, 9849411002 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన వారిపై కేసు

తిమ్మాపూర్, జనవరి 2: డిసెంబరు 31న రాత్రి విధులు నిర్వహిస్తున్న పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన నాలుగురిపై ఎల్ఎండి పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించారు. ఎల్ఎండి ఎస్సై చేరాలు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ అలుగునూర్‌లో డిసెంబరు 31 రాత్రి నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటలను చోటు చేసుకోకుండా ఎల్ఎండి పోలీసులు, క్విక్ రెస్పాన్స్‌టీ(క్యూఆర్‌సి) పోలీసులు విధులు నిర్వర్తిస్తుండగా అలుగునూర్‌కి చెందిన కొందరు టాపాసులు పెల్చుతు, కేక్ కట్ చేస్తుండగా దాన్ని పోలీసులు అడ్డుకునేందకు ప్రయాత్నం చేసి టాపాసులు పేల్చవద్దని ఆదేశించారు. అయిన వారు వినకుండా విధుల్లో ఉన్న పోలీసులపై దురుసుగా ప్రవర్తిస్తు, దుర్భాషాలాడారు. దీంతో అలుగునూర్‌కి చెందిన గోపు మల్లారెడ్డి, బైరీ రాజు, బుర్ర లక్ష్మణ్, రమేష్ నలుగురిపై సెక్షన్ 294, 353 కింద సోమవారం కేసులు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చేరాలు తెలిపారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

శంకరపట్నం, జనవరి 2: శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలో ఇటీవల ఓ వృద్ధుడు తప్పిపోయి శవంగా లభ్యమైన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గత సంవత్సరం డిసెంబరు 15న మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన బండారి భూమయ్య (80) అనే వృద్ధుడు కనిపించకుండా పోయాడు. దీంతో మృతుడి కూతురు బాడిష సుజాత గత నెల 18న కేశవపట్నం పోలీస్ స్టేషన్లో తన తండ్రి భూమయ్య కనబడడం లేదని ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. నూతన సంవత్సరం నాడు కరీంపేట గ్రామంలో వృద్ధుడి శవం వ్యవసాయ భూమి పొదల పక్కన పడి ఉందని సమాచారం వచ్చింది. దీంతో మృతుడి కూతురు వెళ్లి చూడగా తన తండ్రిదేనని గుర్తించింది. తన తండ్రి మతిస్థిమితం లేక తిరుగుతూ కరీంపేట గ్రామ శివారులోని ఓ కౌలు రైతు పొలంలో పడిపోయి మృతి చెందాడని, ఎవరిపై అనుమానం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బిర్యాని సెంటర్‌పై దాడి కేసులో ఐదుగురి రిమాండ్

జమ్మికుంట, జనవరి 2: జమ్మికుంట పట్టణంలోని ఓ బిర్యాని సెంటర్‌పై దాడి చేసి, ఫర్నీచర్ ధ్వంసం చేసిన సంఘటనలో ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి, సీఐ బర్పటి రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 31న బిర్యాని సెంటర్‌కు వచ్చిన ఐదుగురు యువకులు, సిబ్బంది మధ్య జరిగిన వాగ్వాదం జరగగా యువకుడు ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. హోటల్ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పి అరవింద్, జి రాజు, పి హరీష్, పి సాగర్, పి అనిల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. వారిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

కెమెరా దొంగిలించిన వ్యక్తి అరెస్టు

కరీంనగర్ క్రైం, జనవరి 2: కలెక్టరేట్ ఎదుట నాలుగు రోజుల క్రితం ఒక కెమెరామెన్ బ్యాగ్ చోరీకి గురి కాగా పోలీసులు మంగళవారం నిందితుడిని పట్టుకుని వీడియో కెమెరాతో పాటు అందులోని పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు కరీంనగర్ ఏసీపీ జి నరేందర్ విలేకరుల సమావేశంలో తెలిపారు. కట్టరాంపూర్‌కు చెందిన జునుగారి శంకర్ కూలి పనిచేస్తూ తాగుడుకు బానిసగా మారాడని, మద్యం కోసం డబ్బులు లేక డిసెంబరు 30న కలెక్టరేట్ ఎదుట బైక్‌పై కనబడిన కెమెరా బ్యాగును ఎత్తుకెళ్లాడని ఏసీపీ తెలిపారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేయగా నిందితుడి కోసం గాలిస్తుండగా మంగళవారం అంబేద్కర్ స్టేడియం వద్ద శంకర్ అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని విచారించగా బ్యాగును ఎత్తుకెళ్లిన నేరం ఒప్పుకున్నాడని తెలిపారు. నిందితుడు గతంలో ఏడు నేర ఘటనలకు పాల్పడినట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు పంపినట్టు ఆయన తెలిపారు.

కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు చేయించాలి

- జనవరి చివరిలోగా రోడ్ల మరమ్మతులు - ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి

రాయికల్, జనవరి 2: ప్రజాపాలన కార్యక్రమానికి వచ్చిన ప్రజల నుంచి కొత్తగా రేషన్‌కార్డులు కావాలనుకున్నవారి నుంచి దరఖాస్తులు చేయించాలని ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి అన్నారు. రాయికల్ మండలంలోని బోర్నపెల్లి, భూపతిపూర్, వీరాపూర్ తదితర గ్రామాల్లో ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. భూపతిపూర్ గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని అప్లికేషన్ పత్రంపై ప్రజలకు అవగాహన కల్పించారు. బోర్నపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ఎత్తిపోతల పంపులను పరిశీలించి త్వరలోనే శుద్ధి నీరు అందజేస్తామని తెలిపారు. బోర్నపల్లి గ్రామంలో ఇటీవల ఇల్లు కాలిపోయిన భారతపు లక్ష్మీనర్సయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించడంతో పాటు అధికారులతో మాట్లాడి ప్రభుత్వం నుంచి వచ్చే సహాయాన్ని అందించాలని సూచించారు. రామాజీపేట నుంచి వీరాపూర్, వీరాపూర్ నుంచి రాయికల్ ఎక్స్ రోడ్డులో కల్వర్టు చెడిపోవడంతో మరమ్మతులు చేపట్టకపోవడంతో వీరాపూర్, రామాజీపేట గ్రామస్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని, రెన్యూవల్ బ్రిడ్జి మంజూరై టెండర్ కూడా పూర్తయినట్లు తెలిపారు. సాధ్యమైనంత త్వరలో కొత్త వంతెన నిర్మాణం చేపట్టి భవిష్యత్‌లో ఎప్పుడూ ఎలాంటి ఆటంకాలు రాకుండా చూస్తామన్నారు.



దెబ్బతిన్న కల్వర్టును పరిశీలిస్తున్న జీవన్‌రెడ్డి

గత వర్షాకాలంలో భారీ వర్షానికి రోడ్డు కోతకు గురై ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్న దృష్ట్యా సమస్యను జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా రోడ్లను పరిశీలించిన ఎమ్మెల్సీ తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వీరాపూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు సోమ వెంకటేష్, సుందరగిరి గంగాధర్, దుంపల నర్సారెడ్డి, భూపతిపూర్ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, జక్కుల సాగర్ విష్ణు, శేఖర్ రెడ్డి, నాగరాజు, రాజు, సంతోష్, నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ కాలువకు నీటి విడుదల తగ్గింపు

జగిత్యాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఎస్ఆర్ఎస్పీ నుంచి కాకతీయ కాలువ ద్వారా సరఫరా చేస్తున్న నీటి విడుదలను మంగళవారం అధికారులు తగ్గించారు. ఇప్పటివరకు 6 వేల క్యూసెక్కుల నీటిని కాలువకు విడుదల చేస్తున్నారు. కొద్ది కొద్దిగా 3,500 క్యూసెక్కులకు తగ్గిస్తున్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు సామర్థ్యం 90.3 టీఎంసీలు కాగా ప్రస్తుతం డ్యామ్‌లో 70.67 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి డ్యామ్‌లో 79.621 టీఎంసీల నీరు ఉంది.

ప్రాజెక్టు నుంచి 7,983 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో కాకతీయ కాలువకు ఆరు వేల క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 472 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 500 క్యూసెక్కులు, మిషన్ భగీరథ పథకాలకు 152 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గత యేడాది జూన్ ఒకటవ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 200.682 టీఎంసీల నీరు రాగా, 150.917 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

కిరాణా షాపు దగ్ధం

మల్లాపూర్, జనవరి 2: షార్ట్ సర్క్యూట్‌తో మండల కేంద్రంలోని కస్తూరి సంతోష్‌కుమార్‌కు చెందిన కిరాణా షాపు దగ్ధమైంది. మంగళవారం కిరాణం షాపులో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో స్థానికుల సహాయంతో మంటలను ఆర్పి వేశారు. అప్పటికే షాపులోని వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంతో రూ. 3లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు సంతోష్ తెలిపారు. ప్రభుత్వం సహాయం అందించాలని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మారుతి(ఫైల్)

రాయికల్, జనవరి 2: మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన దాసరి మారుతి (24) ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు కింద పడి మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మారుతి తన స్నేహితుడు సింగం నరేష్‌తో కలిసి మంగళవారం ఉదయం 3 గంటల ప్రాంతంలో మైతాపూర్ నుంచి అల్లీపూర్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో రాయికల్ తహసీల్దార్ కార్యాలయం మూల మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి దగ్గరలోని ఇంటికి గల షట్టర్స్‌ను ఢీకొట్టి కింద పడ్డారు. దీంతో మారుతి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనకాల కూర్చున్న నరేష్‌కు గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. మారుతి తండ్రి రాజరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

● బైక్ అదుపు తప్పి మరో యువకుడు..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కథలాపూర్: నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని తన స్నేహితున్ని పక్కన గ్రామంలో దించి కోరుట్లకు వెళ్తున్న యువకుడు బైక్ అదుపు తప్పి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. భీమారం మండలం పసునూరుకు చెందిన బెజ్జంకి అభిలాష్ (21) గత నెల 31న స్నేహితులతో కలిసి కొత్త సంవత్సర వేడుకలు జరుపుకున్నాడు. పక్కనే ఉన్న రాజలింగంపేటలో తన స్నేహితున్ని దించి పనిమీద కోరుట్లకు బయలు దేరాడు. టీఎస్ 02 ఈపీ 1941 నంబర్ గల బైక్‌పై వెళ్తున్న క్రమంలో మండలంలోని గంభీర్‌పూర్ శివారులో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న గోతిలో పడ్డాడు. గోతిలో నీళ్లు ఉండడంతో మునిగి చనిపోయాడు. రెండు రోజుల నుంచి ఫోన్ స్విచ్ఛాప్ రావడంతో అభిలాష్ జాడ కుటుంబ సభ్యులకు తెలియలేదు. మంగళవారం అటువైపు వెళ్తున్న రైతులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై పబ్బ కిరణ్‌కుమార్ పరిశీలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లాలో వేర్వేరు చోట్ల ముగ్గురు మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు.

గంభీరావుపేట, జనవరి 2: గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన ఎండీ ఇబ్రహీం (55) అనే వ్యక్తి నమాజ్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, బంధువుల వివరాల ప్రకారం.. ఇబ్రహీం గేదెల వ్యాపారం చేసుకుంటూ జీవించేవాడు. నాలుగేళ్ల కిందట పక్షవాతం వచ్చి అనారోగ్యానికి గురయ్యాడు. కర్ర సాయంతో జీవనం సాగిస్తువచ్చాడు. ఆరోగ్యం సహకరించక పోవడం, ఎవ రూ పట్టించుకోక పోవడంతో మానసికంగా కుంగిపోయేవాడు. ఇటీవల, పిల్లలతో సహా భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో ఇబ్రహీం మరింత మానసిక వేదనకు లోనయ్యాడు. బీడీలు తెచ్చుకుంటానని చెప్పి సోమవారం సాయంత్రం ఇంట్లో నుం చి వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి తిరిగి రాక పోవడంతో బంధువులు వెతికారు. మంగళవారం గ్రామ సమీపంలోని నమాజ్ చెరువులో శవమై తేలాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

సిరిసిల్ల క్రైం: సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన ఒడ్నాల పరమేశ్వర్ (53) అనే చిరువ్యాపారి మంగళవారం కొత్త చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ వివరాల ప్రకారం... రాజీవ్‌నగర్‌కు చెందిన పరమేశ్వర్ దుస్తులు విక్రయిస్తూ జీవనం సాగించేవాడు. మూడేళ్ల క్రితం అతడి కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో మానసికంగా ఆందోళనకు గురయ్యాడు. తాగుడుకు బానిసై వ్యాపారం తగ్గించాడు. మరోవైపు రూ. 2లక్షల అప్పులు అయ్యాయి. వివాహం చేయాల్సిన కూతురు ఉంది. జీవనోపాధికి సిరిసిల్లలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద పరమేశ్వర్ ఇటీవల చాయ్ హోటల్ ఏర్పాటు చేశాడు. సక్రమంగా నడవకపోవడంతో మనస్తాపం చెందాడు. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయల్దేరి కొత్త చెరువు వద్దకు వెళ్లాడు. అక్కడే ఉన్న వాచ్‌మెన్ ఫోన్ తీసుకొని భార్య కృష్ణవేణికి కాల్ చేశాడు. తాను చెరువులో దూకి చనిపోతున్నాని, కాపాడుకోమని పెట్టేశాడు. అక్కడే ఉన్న వాచ్‌మెన్ అతడిని వారించినా వినిపించుకోకుండా చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే పరమేశ్వర్ భార్యకు ఫోన్ చేసి వాచ్‌మెన్ విషయం చెప్పాడు. తనకు ఈత రాదని వాచ్‌మెన్ పేర్కొన్నాడు. ఈ మేరకు కుటుంబసభ్యులు చెరువు వద్దకు వెళ్లి చూడగా పరమేశ్వర్ చెరువులో శవమై కనిపించాడు. కృష్ణవేణి ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



ఇబ్రహీం మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ మహేష్

కరీంనగర్ క్రైం: కరీంనగర్ ముకరంపురకు చెందిన ఎం. వాసంతిశెట్టి(61) అనే వృద్ధురాలు ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకుంది. రెండో ఠాణా సీఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని ఒక హోటల్ యజమాని భార్య అయిన వాసంతి కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతోంది. ఆమె మానసిక పరిస్థితి సరిగాలేక ఆత్మహత్యకు పాల్పడింది. మంగళవారం ఉదయం 11గంటల ప్రాంతంలో వాసంతి తన ఇంటిలోని వంట గదిలోకి వెళ్లి చీరకు నిప్పంటించుకుంది. ఇంట్లో నుంచి పొగ రావడం గమనించిన ఆమె కుటుంబ సభ్యులు, వర్కర్లు బలవంతంగా తలుపులు తెరిచి ఆమెను ఒక ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. రెండేళ్ల కిందట వాసంతిపై గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి వెళ్లి దాడి చేశాడని కేసు నమోదు కాగా పోలీసుల విచారణలో ఎవరు దాడి చేయలేదని వెల్లడైంది. తాజాగా ఆమె ఆత్మహత్యకు పాల్పడడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై లోతుగా విచారణ జరుపుతున్నామని, పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత మరణానికి కారణం తెలుస్తుందని సీఐ తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

కోల్‌సిటీ, జనవరి 2: గోదావరిఖని సప్తగిరికాలనీలో జరిగిన వంచర్ల గంగాధర్‌రావు హత్య కేసులో నిందితుడు చోడ రవితేజ(30)ని మంగళవారం అరెస్టు చేసినట్టు వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు పేర్కొన్నారు. గత నెల 31వ తేది రాత్రి చోడ రవితేజ, గంగాధర్‌రావులు గొడవపడ్డారని, డబ్బుల విషయంలో తిట్టుకున్నారన్నారు. రవితేజ వద్ద గంగాధర్‌రావు కూలీగా పని చేస్తున్నాడని, తరచూ డబ్బులు అడుగుతున్నాడనే కోపంతో అతన్ని తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడన్నారు. తీవ్ర రక్తస్రావంతో రవితేజ మరణించాడన్నారు. మృతుడి స్వగ్రామం ఆంధ్రప్రదేశ్ పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం అని తెలిపారు.

మద్యం సీజ్

కరీంనగర్ క్రైం, జనవరి 2: రాంనగర్‌లోని అప్నా వైన్ షాపు పక్కన పర్మిట్‌రూంలో ఎలాంటి అనుమతి లేకుండా అధిక ధరకు మద్యం విక్రయి స్తున్నారని రెండో ఠాణా పోలీసులు తనిఖీలు చేసి 6,130 రూపాయల విలువైన మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. మంగళవారం ఉదయం 5:40 గంటలకు అందిన సమాచారం మేరకు పర్మిట్ రూం వద్ద తనిఖీ చేయగా పర్మిట్ రూం నిర్వాహకులు వల్లకొండ బాపురెడ్డి, భోగ రాజేందర్‌లు అధిక ధరకు మద్యం విక్రయిస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పర్మిట్ రూం నిర్వాహకులు ఇద్దరిపై ఎక్సైజ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శోకసంద్రమైన జగ్గరావుపల్లి

- స్వగ్రామానికి చేరుకున్న సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ చాడ శివకృష్ణారెడ్డి మృతదేహం

బోయినపల్లి, జనవరి 2: మండలంలోని జగ్గరావుపల్లికి చెందిన సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ చాడ శివకృష్ణారెడ్డి (23) మృతదేహం మంగళవారం స్వగ్రామానికి చేరుకోగా సీఐఎస్ఎఫ్ అధికారులు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. శివకృష్ణారెడ్డి రాజస్థాన్‌లోని డీవోలిలో 6వ బెటాలియన్‌లో డాక్యుమెంటరీ సెక్యూరిటీగా విధులు నిర్వర్తిస్తున్నాడు. గత నెల 16న ప్రమాదవశాత్తు కింద పడడంతో కోమాలోకి వెళ్లాడు. అప్పటినుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శివకృష్ణారెడ్డి సోమవారం మృతి చెందాడు. మృతదేహాన్ని సీఐఎస్ఎఫ్ అధికారులు స్వగ్రామానికి తీసుకొస్తుండగా మార్గమధ్యమైన కొదురుపాక నుంచి యువకులు బైక్ ర్యాలీతో జగ్గారావుపల్లికి తీసుకోవచ్చారు. తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, బంధువులు మృతదేహంపై పడి బోరున విలపించారు. పార్థివదేహాన్ని చూడడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శివకృష్ణారెడ్డి అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. జైపూర్ నుంచి పార్థివ దేహంతో వచ్చిన సీఐఎస్ఎఫ్ అధికారులు మృతుడి యూనిఫామ్‌ను, జాతీయ జెండాను తల్లిదండ్రులకు అప్పగించి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. తహసీల్దార్ పుష్పలత, కాంగ్రెస్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కూస రవీందర్ నివాళులర్పించారు.



పాడె మోస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

పెద్దమ్మ ఆలయంలో కాత్యాయనిదేవి వ్రతాలు

మెట్‌పల్లి, జనవరి 2: పట్టణంలోని పెద్దమ్మ ఆలయంలో కాత్యాయదేవి సామూహిక వ్రతాలను ఘనంగా భక్తులు చేపట్టారు. మార్గశిర ధనుర్మాసం మంగళవారం సందర్భంగా పెద్దమ్మ ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి, కాత్యాయనిదేవి వ్రతాలు, కుంకుమ పూజలు ఆలయ పురోహితుడు మదన్‌శర్మ అంగరంగ వైభవంగా జరిపించారు. ఉదయం నుంచి ఆలయంలో అమ్మవారికి, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకం జరిపి లోక కళ్యాణార్థం ప్రత్యేక పూజలు జరిపారు. ఆయలంలో సామూహిక వ్రతాలు, కుంకుమ పూజలను భక్తులచే జరిపించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దత్తత్రేయుని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపి, ఐశ్వర్యలక్ష్మి గోశాలలోని ఆవులకు ఆహారం అందజేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

సీసీఐకి విక్రయించే రైతులు సమాచారం ఇవ్వాలి

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

జమ్మికుంట, జనవరి 2: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)కి పత్తి విక్రయించే రైతులు మార్కెట్ అధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిణి పద్మావతి అన్నారు. మంగళవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. 'పత్తి అమ్మకానికి ఆన్‌లైన్ చిక్కులు' అనే కథనం సోమవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితం కావడంతో స్పందించారు. ఈ సందర్భంగా జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిణి మాట్లాడుతూ రైతులు ఎంత పత్తి అమ్మకానికి తీసుకు వస్తున్నారు, భూమి ఎంత ఉంది, ఆన్‌లైన్‌లో నమోదైన విస్తీర్ణం ఎంత, పత్తి ఎన్ని క్వింటాళ్లు అమ్ముకోవచ్చనే వివరాలను మార్కెట్ అధికారులు వెల్లడిస్తారన్నారు. పత్తి తీసుకు వచ్చిన తర్వాత ఆన్‌లైన్‌లో భూమి నమోదై లేకుంటే సీసీఐ కొనుగోలు చేయదని తెలిపారు. రైతులు ఎప్పుడు ఫోన్ చేసినా మార్కెట్ అధికారులు వివరాలు వెల్లడించేందుకు సిద్ధంగా ఉంటారని, రైతులు సహకరించాలని కోరారు. అధికారులు, సిబ్బంది ఉన్నారు.

బైపాస్ రోడ్డు రద్దు చేయాలని రైతుల ఆందోళన



మెట్‌పల్లిలో సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆదోళన చేస్తున్న రైతులు

మెట్‌పల్లి రూరల్, జనవరి 2 : మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులో ఏర్పాటు చేయనున్న ఎన్‌హెచ్-63 జాతీయ బైపాస్ రోడ్డును రద్దు చేయాలని రైతులు నిరసన తెలిపారు. మంగళవారం వెల్లుల్ల గ్రామ శివారులో బైపాస్ రోడ్డు ఏర్పాటుకు అధికారులు పరిశీలించడానికి రావడంతో రైతులు ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ర్యాలీగా వెళ్లి సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ భూములను నమ్ముకొని 200 కుటుంబాలు బతుకుతున్నాయని, బైపాస్ ఏర్పాటు రోడ్డు ఏర్పాటుకు వ్యవసాయ భూములను తీసుకుంటే తమ కుటుంబాలు ఆధారము కోల్పోయి ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా విష్ణు సహస్ర పారాయణం



మెట్‌పల్లిలో ఎమ్మెల్యే తల్లి సరోజను సన్మానిస్తున్న మహిళలు

మెట్‌పల్లి, జనవరి 2 : ధనుర్మాసం సందర్భంగా మెట్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విష్ణు సహస్ర పారాయణ కార్యక్రమాన్ని మహిళ లు ఘనంగా నిర్వహించారు. మంగళవారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ నివాసంలో ధనుర్మాసం సందర్భంగా పురోహితుడు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్, సరోజన దంపతులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపి మహిళలకు, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం కోరుట్ల నియోజక వర్గంలోని పలు గ్రామాల నుంచి భక్తులు విష్ణు సహస్ర పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస తరంగిణి సభ్యులు సరోజను శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడాకారిణికి సన్మానం

మెట్‌పల్లి రూరల్, జనవరి 2: ఇటీవల జరిగిన జాతీయ స్థాయి సాఫ్ట్ బేస్‌బాల్ పోటీల్లో గెలిపొందిన కోనారావుపేట గ్రామానికి చెందిన మెనుగందుల వనజను సర్పంచు ఏగుర్ల శ్యామల-మురళి, ఉప సర్పంచు మారు జనార్ధన్‌రెడ్డిలు సన్మానించారు. కేరళ రాష్ట్రంలో జాతీయ స్థాయి సాఫ్ట్ బేస్ బాల్ అండర్ 16 విభాగంలో నిర్వహించిన పోటీల్లో ద్వితీయ బహుమతి పొందినందుకు క్రీడకారిణి శాలువలతో ఘనంగా సన్మానించి అభినందించారు. గ్రామీణ స్థాయిలోని విద్యార్థి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని బహుమతి పొందడంతో మిగతా విద్యార్థులకు ఆదర్శంగా నిలించిందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలక వర్గం సభ్యులు పరందాములు, డాక్టర్ స్వేత, ఏఎన్ఎమ్ సరోజ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాజ సేవలో ప్రతీ ఒక్కరు ముందుండాలి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జనవరి 2: సమాజ సేవలో ప్రతి ఒక్కరు ముందు ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని 11వ వార్డులో కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన క్యాలెండర్‌ను మంగళవారం ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్యాలెండర్లు వార్డు పరిధిలో గల ప్రజలకు పంపిణీ చేయడం ద్వారా కౌన్సిలర్ దంపతులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అంతకు ముందు మండలంలోని దమ్మన్నపేటలో లక్ష్మణ్‌కుమార్ స్వామి వారికి కొబ్బరికాయలు కొట్టి, అభిషేకం, పూజా కార్యక్ర మాల్లో పాల్గొన్నారు. ఆలయం పక్షాన అర్చకులు గుండి నర్సయ్యశర్మ ఆయన కు స్వామి శేష వస్త్రం కప్పి, ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మున్సిపల్ కౌన్సిలర్ సంగనభట్ల సంతోషి, దమ్మన్నపేట ఎంపీటీసీ గంగాధర్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్ పాల్గొన్నారు.

'తాగునీటి సమస్య పరిష్కరించండి'

రాయికల్, జనవరి 2: పట్టణానికి చెందిన 10వ వార్డు ప్రజలు తమ కాలనీలో నీటి కొలాయి రావడం లేదని, ప్రజాపాలన అధికారికి మంగళవారం ఫిర్యాదు చేశారు. తమ వార్డులో ఒక బోరు బావి చెడిపోయి సంవత్సరం గడుస్తున్నా బాగు చేయించలేదని, అధికారులకు ఎన్నిమార్లు మొర పెట్టుకున్నా ఫలితం లేకుండాపోయిందన్నారు. తాము ఎస్సీ మాదిగ కులస్థుల ముకాబట్టి ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. కావున ఇకనైనా తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 10వ వార్డు మాదిగ సంఘం సభ్యులు సంధ్య, జల, లక్ష్మి, కవిత, గంగారాం, నిషా, శ్రీనివాస్, రాజేందర్, రాజు, జగదీష్, హాశ్విత్, భాస్కర్ పాల్గొన్నారు.

'ప్రజాపాలన'ను సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లి, జనవరి, 2 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అభయహస్తం గ్యారెంటీ పథకాలకు దరఖాస్తుల ప్రక్రియను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు కొమిరెడ్డి కరంచంద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని కొమిరెడ్డి రాములు పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అన్ని వర్గాల పేదలను ఆదుకునేందుకే ప్రభుత్వం పక్కా ప్రణాళికతో గ్రామసభల నిర్వహిస్తోందని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఖాదీ బోర్డుకు జీవిత కాలం చైర్మన్‌గా ఉండడం సరికాదని, ఈ నియమాల గురించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి బీసీ వర్గమైన పద్మశాలీలకు దక్కేలా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రైసుద్దీన్, సురభి అశోక్, పెంట ప్రణయ్, విజయ్‌పటేల్, నాగరాజ్, వేణు, పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా సదానందం

మెట్‌పల్లి, జనవరి, 2 : మెట్‌పల్లి బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడుగా మాచర్ల సదానందంను నియమిస్తూ మంగళవారం జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాండబేరి నరేష్ ఉత్తర్వులు జారీ చేశారు. సదానందం మాట్లాడుతూ పట్టణంలోని బీసీ పరిధిలోని సంఘాల అభివృద్ధికి నాయకుల సహకారంతో కృషి చేస్తానన్నారు. నియామకానికి సహకరించిన రాష్ట్ర కార్యదర్శి గాజుల నాగరాజు, బొమ్మల శంక ర్, నేమూరి లక్ష్మయ్య, శ్రీకాంత్, రాజు, సంఘాల నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా అమ్మక్కపేట గ్రామానికి చెందిన ఆవుల శ్రీకాంత్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షులు బ్రహ్మాండబేరి నరేష్, బీసీ సంక్షేమ సంఘ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నల్ల వెంకటేశ్వర్లు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమ సం ఘం జాతీయ అధ్యక్షులు జాజాల శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు శ్రీకాంత్‌ను నియమించినట్లు తెలిపారు. నా యకులు శంకర్, నాగరాజ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తాం

విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్



కమలాపూర్‌ల దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జనవరి 2: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ఖచ్చితంగా అమలు చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి మండలంలోని కమలాపూర్, తిమ్మాపూర్, ఆరెపల్లి, తుమ్మెనాల గ్రామాల్లో, ధర్మపురి పట్టణంలోని 5, 6వ వార్డుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కమలాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. నిరుపేద ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించే విషయంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు.

దరఖాస్తులు సమర్పించే ప్రజలకు కౌంటర్ల వద్ద ఎలాంటి సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. చివరగా గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులు ఆయనకు స్వాగతం పలికి పాఠశాల సమస్యలపై దరఖాస్తు సమర్పించారు. సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి లక్ష్మీనారా యణ, ధర్మపురి జడ్పీటీసీ బత్తిని అరుణ, మండల ప్రత్యేక అధికారి, పీఆర్ ఈఈ రహమాన్, తహసీల్దార్ కృష్ణ చైతన్య, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, తిమ్మాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ కమిటీ చైర్మన్ ప్రకాశ్, పీఆర్ ఏఈఈ ముకరం, ఎంపీవో నరేష్‌కుమార్, వైస్ ఎంపీపీ గడ్డం మహిపాల్‌రెడ్డి, సర్పంచులు పాల్గొన్నారు.

ధర్మపురి పట్టణంలోని 5, 6 వ వార్డుల్లో ప్రజా పాలన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రత్యేక అధికారి అభయ హస్తం గ్యారెంటీ పథకాలకు సంబంధించిన దరఖాస్తులను మహిళల నుంచి స్వీకరించారు. మిగతా వార్డుల్లో కూడ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, మున్సిపల్ కమిషనర్ రమేష్, వైస్‌చైర్మన్ ఇందారపు రామయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆరు పథకాలు అమలు చేస్తుంది

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల రూరల్ : రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన పథకాలు అమలు చేసి అర్హులైన అందరికీ అందిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మంగళవారం మండలంలోని యూసుఫ్‌నగర్, అయిలాపూర్ గ్రామాలలో నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమాన్ని సందర్శించి దరఖాస్తు దారులకు పలు సూచనలు సలహాలను అందించారు. దరఖాస్తుదారులతో కలిసి తహసీల్దార్ కిషన్, ఎంపీడీఓ శ్రీనివాస్‌లకు దరఖాస్తులను అందించారు. కాంగ్రెస్ నాయకులు కొంతం రాజం, సంజీవ్ రెడ్డి, లింబాద్రి, పుల్లారెడ్డి, సత్యనారాయణ గౌడ్, మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని వార్డులో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని మంగళవారం ఇన్‌చార్జి ఆర్డీవో రాజేశ్వర్ పరిశీలించారు. ఒకే దరఖాస్తుల్లో ఐదు పథకాలకు సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేయాల్సి ఉంటుండటం వలన ప్రజలు గందరగోళంకు గురవుతున్నారని, కేంద్రాలకు దరఖాస్తుల కోసం వచ్చిన ప్రజల్లో స్పష్టంగా నింపేవిధంగా చూడాలన్నారు. ప్రజాపాలన దరఖాస్తులలో నెలకొన్న సందేహాలను దరఖాస్తు నింపక ముందే పూర్తిగా తెలియజేలని అధికారులకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, డీఈఈ ప్రేమ్‌కుఆర్, ఏఈఈ అరుణ్‌కుమార్, అధికారులు, కౌన్సులర్లు, నాయకులు, పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: ప్రజాల సంక్షేమామే ధ్యేయంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని కాంగ్రెస్ సినియర్ నాయకులు జువ్వాడి కృష్ణ రావు అన్నారు. ఆయన మంగళవారం మండలంలోని అమ్మక్కపేట, యామపూర్, కోమటికొండపూర్ గ్రామాలలో అధికారులు నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమాన్ని సందర్శించారు. ఆయా గ్రామాలో జరుగుతు న్న ప్రజాపాలన కార్యక్రమాన్ని జడ్పీ సీఈవో రఘువరన్ పరిశీలించారు.

మెట్‌పల్లి రూరల్ : ప్రజా పాలన కార్యక్రమాన్ని సమర్థవంతంగా చిత్త శుద్ధితో నిర్వహించాలని, ప్రజలు దరఖాస్తు చేసుకునే ఫారంలో తప్పులు దొర్లకుండా చూడాలని ఇన్‌చార్జి కోరుట్ల ఆర్డీవో రాజేశ్వర్ అధికారులకు సూచించారు. మండలంలోని ఆత్మనగర్, కోనరావుపేట, రాజేశ్వర్‌రావుపేట గ్రామాల్లో మంగళవారం నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమంలో తీసుకుంటున్న జాగ్రత్తలు ఇతర విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మారు సాయిరెడ్డి మండలంలోని నిర్వహిస్తున్న గ్రామ సభలను పరిశీలించి ప్రజలు అర్జీ చేసుకునే దరఖాస్తు ఫారంలో తప్పులు దొర్లకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేన్నన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కోరెపు శ్యామల-మురళి, నేరెళ్ల లక్ష్మి- రాజగౌడ్, జరుపుల శ్రీనివాస్, ఎంపీడీవో భీమెశ్‌రెడ్డి, నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని మూడు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన సభల్లో 1852 దరఖాస్తులు ప్రజల నుంచి స్వీకరించినట్టు ఎంపీడీ జనార్ధన్, తహసీల్దార్ ముంతాజీబోద్దీన్ తెలిపారు. పోతారంలో 689, దుంపెటలో 693, దూలూరులో 472 ఐదు గ్యారంటీలకు సంబంధించి ప్రజలు దరఖాస్తులు సమర్పించారని చెప్పారు. సర్పంచులు అంబటి లతపురుషోత్తం, ధర్మపురి జలంధర్, లక్ష్మీ నర్సయ్య, ఎంపీటీసీలు పులి శిరీషహరిప్రసాద్, నక్క లక్ష్మీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జగిత్యాల రూరల్: ఆరు గ్యారంటీల పథకానికి దరఖాస్తు చేసుకు నేందుకు ప్రతి ఇంటికి ప్రభుత్వమే ఉచితంగా ఫారం లను సరాఫరా చేస్తుందని జగిత్యాల జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా అన్నారు. మంగళవారం జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ గ్రామంలో ప్రజాపాలనలో భాగంగా లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణను కలెక్టర్ పరిశీలించారు. ఈ నెల 6 వరకు గ్రామాల్లో, పట్టణాల్లో అర్హులైన ప్రజల నుంచి ధరఖాస్తులను స్వీకరిస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో డీపీఓ దేవరాజు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.



యూస్‌ఫనగర్‌లో దరఖాస్తులు అందిస్తున్న జువ్వాడి కృష్ణారావు

పెగడపల్లి: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాలలో మంగళ వారం అభయహస్తం ఆరు గ్యారంటీల అమలుకు గాను ప్రజా పాలన గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి ధరఖాస్తులు స్వీకరించారు. సమావేశంలో సర్పంచ్ ఇనుగండ్ల కరుణాకర్ రెడ్డి, ఎంపీపీ గోళి శోభ, ఉప సర్పంచ్ సంతోష్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.

కొడిమ్యాల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహిస్తున్న ప్రజాపాలన దరఖాస్తులను ప్రత్యేక అధికారులు ఎంపీడీవో పద్మజారాణి, తహసీల్దార్ రవికాంత్, ఏఈఈ మణిదీప్ ఆధ్వర్యంలో సిబ్బంది స్వీకరించా రు. ప్రజాపాలన దరఖాస్తు కేంద్రాలను ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు పరిశీలించారు.

గొల్లపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ల బ్ధి పొందాలని ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గ ప్రజా పరిపాలన నోడల్ అధికారి కుందారపు లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు ప్రజాపాలన కార్యక్రమాలు నిర్వహించారు.

మల్యాల: ప్రజాపాలన ఆరు గ్యారంటీలదరఖాస్తులను నాలుగవ రోజు మంగళవారం మండలంలోని పోతారం, నూకపల్లి, రాంపూర్ గ్రామాల్లో దరఖాస్తులను ప్రత్యేక అధికారులు స్వీకరించారు. ఎంపీడీవో వెంకటేషం, ఎంపీవో వాసవి, సర్పంచ్‌లు హరీష్, సరోజ, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

వెల్గటూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని తహసీల్దార్‌లు శేఖర్, ఉదయ్ కుమార్, ఎంపీడీవో సంజీవ్‌రావు కోరారు. శుక్రవారం ఉమ్మడి వెల్గటూర్ మండలంలోని పలు గ్రామాలలో ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించి అభయహస్తం దరఖాస్తులు స్వీకరించారు.



దరఖస్తులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో



పోతారంలో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



ఆత్మనగర్‌లోని గ్రామసభను పరిశీలిస్తున్న ఆర్డీవో రాజేశ్వర్

పెట్రోల్ బంకుల్లో జనం బారులు

● నో స్టాక్ బోర్డుతో వాహన చోదకులకు తిప్పలు ● ట్రక్కుడ్రైవర్ల నిరసనతో నిలిచిన సరఫరా



జగిత్యాలలో ఓ పెట్రోలు బంకు వద్ద కిక్కిరిసిన వాహన చోదకులు



కోరుట్లలో క్యూ లైన్‌లో ఉంచిన క్యానులు

జగిత్యాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): క్రిమినల్ చట్టాల సవరణను వ్యతిరేకిస్తూ పెట్రోలు, డీజిల్ సరఫరా చేస్తున్న ట్రక్కులు సమ్మె చేయాలన్న నిర్ణయం తీసుకున్నారన్న ప్రచారంతో మంగళవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పెట్రోలు బంకులు వినియోగదారులతో కిక్కిరిసాయి. హిట్ అండ్ రన్ కేసులలో ట్రక్కు డ్రైవర్ ప్రమేయం ఉంటే రూ. 7 లక్షల ఫెనాల్టీ, పదేళ్ల జైలు శిక్ష ఉంటుందన్న క్రిమినల్ చట్టాల సవరణను వ్యతిరేకిస్తూ ట్రక్కు డ్రైవర్లు సమ్మె చేయాలని నిర్ణయించుకోవడంతో రానున్న కొద్ది రోజుల్లో పెట్రోలు, డీజిల్ కొరత ఏర్పడవచ్చన్న అభిప్రాయంతో వాహన చోదకులు పెట్రోలు బంకుల వద్దకు క్యూ కట్టారు. చాలా చోట్ల నో స్టాక్ బోర్డులు దర్శనమిచ్చాయి. జిల్లాలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో పెట్రోలు, డీజిల్ కొరత ఉందని సోషల్ మీడియాలో వాటికి సంబంధించిన ఫోటోలు, వీడియోలో వైరల్ అయ్యాయి.

ఇందన ట్రక్ డ్రైవర్లు సమ్మె నిర్ణయాన్ని విరమించుకున్నారని సాయంత్రం వేళలో మరో ప్రచారం సైతం చోటుచేసుకుంది. సమ్మె నిర్ణయం విరమించి ఆయిల్ కంపెనీల్లో పెట్రోలు, డీజిల్ నింపుకొని ట్రక్కు డ్రైవర్లు బయలు దేరారన్న ప్ర చారం చోటుచేసుకోవడం వాహన చోదకుల్లో కొంత ఊరటను ఇచ్చింది.

కోరుట్ల : పట్టణంలోని వివిధ పెట్రోల్ బంకుల వద్ద పెద్ద ఎత్తున వాహనాలు బారులు తీరాయి. ఈ నెల 3వ తేదీ నుంచి దేశ వ్యాప్తంగా ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్లు నూతనంగా ప్రవేశపెట్టిన రోడ్డు ప్రమాదాల నిబంధనలు విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ట్యాంకర్ల ఇచ్చిన బందు ప్రకటనతో పెట్రోల్ బంకుల వద్ద వినియోగదారులు బారులు తీరారు. పట్టణంలోని జాతీయ రహదారిని ఆను కుని ఉన్న బంక్‌లతో పాటు మాదాపూర్ రోడ్డు, వేములవాడ రోడ్డులో ఉన్న బంకుల వద్ద వాహనాలు నిలిచాయి. అదే విధంగా వాహనాలతో పాటు బంక్‌ల ఆవరణలో వినియోగదారులు క్యాన్లలో డిజల్, పెట్రోల్ నింపుకోవడానికి క్యూలైన్‌లో ఉంచడంతో బంకులు సందడిగా మారాయి.

ధర్మపురి: ధర్మపురి పట్టణంలోనూ పలు బంకుల వద్ద వాహనదారులు బారులు తీరారు. ట్రక్కులు సమ్మె విషయం వాట్సప్‌లో చక్కర్లు కొట్టడంతో ఒక్కసారిగా వాహనదరులు ఎగబడ్డారు. ఒక్కసారిగా పెద్ద ఎత్తున వాహనదారులు బంకులకు చేరడంతో బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిచ్చాయి. మరోవైపు ఆలయ దర్శనం కోసం వచ్చిన భక్తులు కూడా కొంత ఆందోళనకు గురయ్యారు. కొద్ది సేపటికే మళ్లీ సమ్మె విరమించారనే వార్తతో కాస్త ఊరట చెందారు.

శ్రీరాముని అక్షింతల ఊరేగింపు



రాయికల్‌లో అక్షింతలను ఊరేగింపుగా తీసుకువెళ్తున్న భక్తులు

రాయికల్, జనవరి 2: రాయికల్ పట్టణంలో అయోధ్య శ్రీరాముని అక్షిం తలను స్థానిక హనుమాన్ దేవాలయం నుంచి పాత బస్టాండ్ మీదుగా శివాజీ విగ్రహం వరకు డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగించారు. అనంతరం ఇంటింటికీ అక్షింతలను వితరణ చేశారు. ఈ శోభాయాత్రలో విద్యార్థులు కూడా భాగస్వామ్యమయ్యారు. మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, కౌన్సిలర్లు మ్యాకల అనురాధ, తురగ శ్రీధర్ రెడ్డి, మహేష్ గౌడ్, మహేందర్ బాబు, కొయ్యడి మహిపాల్, దివాకర్, మోహన్‌రెడ్డి, గంగాధర్, శ్రీకాంత్‌రెడ్డి, అశోక్, రాంగోపాల్ పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండలంలోని పూడూర్, శ్రీరాములపల్లి గ్రామాల్లో మంగళ వారం శ్రీ రామ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నుంచి వచ్చిన అయోధ్య రామ అక్షింతలను మార్కెండేయ దేవాలయం నుంచి గ్రామ ప్రముఖులు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని పలువురి ఇళ్లలో పంపిణీ చేశారు. సర్పంచు కవిత రవికుమార్, శ్రీరాములపల్లి గ్రామ ఇన్‌చార్జ్ సర్పంచు చల్ల శ్రీనివాసరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రవీందర్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ నాగభూష ణరెడ్డి, ఉప సర్పంచు లింగారెడ్డి, కొండగట్టు దేవస్థానం డైరెక్టర్ లింగాగౌడ్, పలువురు పంచాయతీ సభ్యులు, గ్రామంలోని వివిధ కుల సంఘాల నాయకులు, పలు వురు ప్రజాప్రతినిదులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మల్లాపూర్ : అయోధ్యలోని రాముని వద్ద పూజింప బడిన పవిత్రమైన అక్షింతలను మల్లాపూర్ మండల కేంద్రంలో అందజేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఇంటింటికి భజరంగ్ దళ్ సభ్యులు వెళ్లి అక్షింతలు, రాముని చిత్రపటాన్ని అందజేసి విశిష్టతను వివరించారు. వారు మాట్లాడుతూ వందల సంవత్సరాల నిరీక్షణ అనంతరం అయోధ్యలో రామ మందిరం నిర్మాణం చేపట్టడడం చాలా గొప్ప విషయమన్నారు. మొగిలిపేట గ్రామంలోని కల్యాణ మండలం నిర్మాణానికి నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్ రూ. 4.50 లక్షలను మంజూరు చేసిన ప్రొసిడింగ్ పత్రాన్ని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులకు బీజేపీ నాయకులు మంగళవారం అందజేశారు.

మల్యాల: అయోధ్య రామయ్య అక్షింతలతో మ్యాడంపల్లిలో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఇంటింటా అక్షింతల వితరణ పూర్తి చేశారు. సర్పంచ్ రౌతు గంగమహేశ్వరిరవి, ముదుగంటి రాజు, మల్లేశంయాదవ్, పోరెడ్డి రంజిత్, కొండల్‌రెడ్డి గ్రామస్థులు పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నూ అక్షింతలను ఇంటింటా వితరణ చేశారు

గొల్లపల్లి: మండలంలోని దట్నూర్, రంగదామునిపల్లె గ్రామాల్లో అయో ధ్య రాముని అక్షింతలను మంగళవారం శోభాయాత్ర నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ హన్మాండ్లు, సర్పంచ్ పావనినాగేష్ గౌడ్, మధుకర్, భాస్కర్ పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, జనవరి 2: కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయం మంగళవారం భక్తులతో సందడిగా మారింది. వేకువజాము నుంచే కొండ పైకి చేరుకున్న భక్తులు స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. బేతాళుడిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఈవో వెంకటేష్, అధికారులు పర్యవేక్షించారు.

డెంగీతో వివాహిత మృతి

కథలాపూర్, జనవరి 2 : మండలంలోని దూలూరుకు చెందిన జిల్లా సౌమ్య (24) అనే వివాహిత డెంగీతో మృతి చెందింది. నాలుగు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతూ కరీంనగర్‌లో చికిత్స పొందుతోంది. పరిస్థితి విషమించి మంగళవారం ఆసుపత్రిలో మృతి చెందింది. మృతురాలికి 19 నెలల పాప ఉంది.

లెక్చరర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా తిరుపతి

కొడిమ్యాల, జనవరి 2 : తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొడిమ్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చరిత్ర లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న డా.. పి. తిరుపతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు కనక చంద్రం మంగళవారం వడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులకు, కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ సాఫ్ట్ బాల్ పోటీల్లో ప్రతిభ

కోరుట్ల, జనవరి 2 : గత సంవత్సరం డిసెంబర్ 28 నుంచి 30వ తేదీ వరకు జరగిన జాతీయ సాఫ్ట్ బాల్ చాంపియన్ పోటీలలో కోరుట్ల విద్యార్థి ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రిన్సిపల్ గుజ్జేటి వెంకటేష్ మంగళ వారం తెలిపారు. జాతీయస్థాయి చాపియన్ షిప్ పోటీలలో తెలంగాణ రాష్ట్ర తరుపున పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వనజ పాల్గొన్ని జట్టు రెండవ స్థానంలో నిలవడానికి కృషి చేసినట్లు తెలిపారు. విద్యార్థి వనజతో పాటు పీఈటీ శంకర్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేష్, ఉపాధ్యాయులు అభినందించి సన్మానించారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా

కథలాపూర్, జనవరి 2 : మండలంలోని తుర్తి మాజీ సర్పంచ్ మట్కం గంగభూమయ్య బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని మండల అధ్యక్షుడు గడీల గంగప్రసాద్‌కు పంపించినట్టు చెప్పారు. 2018 నుంచి గ్రామంలో సీసీ రోడ్లు, హైమాస్ లైట్లు, అంగన్‌వాడీ భవనం మిగులు పనులు, పాఠశాల వద్ద బోరు నిర్మాణం వంటి పనుల కోసం రు. 10 లక్షలు పెట్టుబడి చేసినట్టు చెప్పారు. ప్రొసీడింగులు ఇస్తాము పనులు చేసుకొమ్మని చెబితే అప్పులు తెచ్చి పూర్తి చేశానన్నారు. ఐదేళ్లుగా ఎదురు చూసి విసిగెత్తి పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు పేర్కొన్నాడు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

కొడిమ్యాల, జనవరి 2 : రైతులు సింగిల్ విండో నుండి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని సింగిల్ విండో చైర్మన్ మెన్నేని రాజనర్సింగరావు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో సాధారణ సమావేశం చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ తీసుకున్న రుణాలను గడువు ప్రకారం చెల్లిస్తే ఇతర రైతులకు రుణాలను అందించడం జరుగుతుందన్నారు. ఉపాధ్యక్షురాలు కవితచంద్రమొహన్‌రెడ్డి, డైరెక్టర్లులు, సీఈవో గంగాధర్, కార్యాలయ సిబ్బంది, పాల్గొన్నారు.